

లెబనాన్ ప్రధాని నవఫ్ సలెమ్‌తో సమావేశమైన ఖతార్ అమిర్ షేక్ తమిమ్

# సయోధ్యకు కేరాఫ్ ఖతార్

- మధ్యవర్తిత్వంలో పెద్దన్న
- గల్ఫ్ నుంచి ఆఫ్రికా వరకూ దేశాల మధ్య ఘర్షణలకు చెక్ పెట్టడంలో మంచి ట్రాక్ రికార్డ్
- ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య సయోధ్యలోనూ కీలక పాత్ర

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య గడిచిన 12 రోజులుగా కొనసాగిన యుద్ధానికి కాల్పుల విరమణ ఒప్పందంతో తెరపడింది. ఇరు దేశాల మధ్య సయోధ్య కోసం ఇజ్రాయెల్‌తో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంప్రదింపులు జరిపినప్పటికీ ఇరాన్‌తో కుదరలేదు. దీంతో ట్రంప్ కోరిక మేరకు రంగంలోకి దిగిన ఖతార్.. ఇరాన్‌ను ఒప్పించింది. మొత్తంగా ఖతార్ మధ్యవర్తిత్వం కారణంగానే ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధానికి తెరపడిందని చెప్పొచ్చు. దీంతో 30 లక్షల జనాభా కూడా లేని ఈ పశ్చిమాసియా దేశంపై అందరి దృష్టి పడింది. అయితే, అంతర్జాతీయ సంఘర్షణలను పరిష్కరించడం ఖతార్‌కు కొత్తేం కాదు. గల్ఫ్ నుంచి ఆఫ్రికా వరకూ పలు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను గతంలో ఖతార్ విజయవంతంగా పరిష్కరించింది కూడా.

**అమెరికా-అఫ్గానిస్థాన్ వివాదం**

సెప్టెంబర్ 11, 2001 దాడి తర్వాత అఫ్గానిస్థాన్‌పై అమెరికా దాడి చేయడం ద్వారా తాలిబన్లపై యుద్ధాన్ని ప్రారంభించింది. అయితే, 2013లో తాలిబన్లకు దోహాలో కార్యాలయాన్ని తెరువడానికి ఖతార్ అనుమతినిచ్చింది. విదేశాలలో తాలిబన్లకు మొదటి కార్యాలయం ఇదే. రెండు దశాబ్దాల అనంతరం అఫ్గానిస్థాన్ నుంచి అమెరికా, నాటో దళాలు వెనక్కి రావడం, అఫ్గాన్‌లో తాలిబన్ల పాలన మొదలయ్యేలా ఒప్పందం జరుగడానికి ఈ దోహా కార్యాలయమే కేంద్రంగా మారింది. దీని కోసం ఖతార్ ఏండ్లుగా మధ్యవర్తిత్వం వహించింది.

**రష్యా-ఉక్రెయిన్ యుద్ధం**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోనూ మధ్యవర్తిగా ఖతార్ ముఖ్యమైన పాత్ర పోషించింది. 2023లో ఖతార్ మధ్యవర్తిత్వం కారణంగానే ఇరు దేశాలకు చెందిన 15 మంది చొప్పున పిల్లలు వాళ్ల తల్లిదండ్రుల వద్దకు చేరుకోగలిగారు.

**ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం**

2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన దాడిలో హమాస్ ఉగ్రవాదులు కనీసం 250 మందిని బందీలుగా తీసుకున్నారు. హమాస్ చెర నుంచి ఖైదీలను విడిపించడంలో ఖతార్ ముఖ్యమైన పాత్ర పోషించింది. గాజాలో మానవతా కార్యకలాపాలు, మౌలిక వసతుల కల్పన ద్వారా హమాస్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి.

**అక్కడ లెబనాన్.. ఇక్కడ సూడాన్**

2008లో లెబనాన్‌లో అంతర్యుద్ధాన్ని ముగించడంలో ఖతార్ ముఖ్యమైన పాత్ర పోషించింది. ఈ క్రమంలోనే దోహా ఒప్పందం తెరమీదకు తీసుకొచ్చింది. లెబనాన్ ప్రభుత్వంలో హెజ్బొల్లాకు ప్రాధాన్యాన్ని కల్పించడానికి కృషి చేసింది. 2011తో పాటు 2020లో సూడాన్‌లో పెచ్చరిల్లిన సంక్షోభానికి, పౌర నిరసనలకు కూడా ఖతార్ తన మధ్యవర్తిత్వంతో పరిష్కారం చూపింది.

### ఖతార్ మాట వింటారెందుకు?

ఖతార్‌లో చమురు నిక్షేపాలు అపారం. దీంతో చిన్న దేశమైనా ఆర్థిక పరమైన శక్తిగా ఖతార్ అవతరించింది. ఈ క్రమంలో పలు దేశాల్లో పెట్టుబడులు పెట్టింది. మౌలిక వసతుల ప్రాజెక్టులకు తన వంతు సాయాన్ని అందిస్తున్నది. దేశాధినేతలతో పాటు హమాస్, హెజ్బొల్లా వంటి సంస్థలతోనూ సఖ్యతగా ఉంటున్నది. ఈ కారణంగానే ఖతార్ ప్రతిపాదనలకు ప్రతీ దేశం ప్రాధాన్యాన్ని ఇస్తున్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు.

# సీజ్‌ఫైర్‌పై అయోమయం!

- ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ట్రంప్ కాల్పుల విరమణ ఒప్పందం
- కాసేపటికే ఉల్లంఘించిన ఇరుదేశాలు
- తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ట్రంప్
- దాడులకు దిగరాదని హెచ్చరిక
- తొలుత ఉల్లంఘించినా, ఒప్పందం అమల్లోనే ఉందని ట్రంప్ స్పష్టీకరణ



ఇరాన్ క్షిపణుల ధాటికి ఇజ్రాయెల్‌లోని బీర్‌షిబాలో దెబ్బ తిన్న ఓ భవనం

దుబాయ్, జూన్ 24: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే, కొద్ది గంటలకే రెండు దేశాలు పరస్పరం దాడులకు దిగడంతో సీజ్‌ఫైర్‌పై సందిగ్ధం నెలకొన్నది. ఈ క్రమంలో ఇరు దేశాలపై ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దాడులకు దిగరాదని రెండు దేశాలను హెచ్చరించారు. తొలుత ఉల్లంఘించినా, ఒప్పందం అమలులోనే ఉందని తెలిపారు.

**ఒప్పందం తర్వాతా ఇరాన్ దాడి**

తొలుత కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉందని ట్రంప్ ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ తమ గగనతలం వైపు 20 క్షిపణులతో దాడి చేయడాన్ని ఇజ్రాయెల్ తప్పుబట్టింది. ఈ దాడిలో నలుగురు పౌరులు మరణించగా, ఆరుగురు గాయపడ్డారని తెలిపింది. అయితే తాము ఇరాన్‌పై దాడులు చేశామన్న ఆరోపణలను ఇరాన్ ఖండించింది. ఒప్పందం అమలుకు గంట ముందు వరకు ఇజ్రాయెల్ తమపై దాడి చేస్తూనే ఉందని ఆరోపించింది. అనంతరం హేగ్‌లో జరిగే నాటో శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యేందుకు వెళుతూ ట్రంప్ మంగళవారం వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడి దీనిపై స్పష్టత ఇచ్చారు. ఇరు దేశాలు ఈ కొత్త ఒప్పందాన్ని తొలుత ఉల్లంఘించినట్టు తాను భావిస్తున్నానన్నారు. అయితే ఇరాన్ పొరపాటున దాడికి దిగి ఉండవచ్చునని పేర్కొంటూ తన మిత్ర ఇజ్రాయెల్ దేశంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తర్వాత దాని చర్యను కూడా సమర్థిస్తూ ఇజ్రాయెల్ ఇక దాడి చేయబోవడం లేదని ప్రకటించారు.

**ఒప్పందం ఉల్లంఘనపై ట్రంప్ ఆగ్రహం**

తన మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ జరిగిన తర్వాత ఇరు దేశాలు దానిని ఉల్లంఘించడమేమిటని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాకేం చెప్పారు? మీరేం చేస్తున్నారు అని ప్రశ్నించారు. ఒక దశలో సహనాన్ని కోల్పోయిన ఆయన అభ్యంతరకర పదజాలాన్ని కూడా వాడారు. ఆ తర్వాత సర్దుకుని ఇరు దేశాలు కాల్పుల విరమణకు వచ్చినట్టు ప్రకటించారు. భవిష్యత్‌లో ఒకరిపై ఒకరు దాడులు చేసుకోరని, ఇజ్రాయెల్ విమానాలు తిరిగి సొంత గడ్డకు చేరుకుంటాయని అన్నారు. తక్షణమే ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమలులోకి వస్తుందని మరోసారి ప్రకటించారు.



**మీ పైలట్‌లను వెంటనే వెనక్కి పిలవండి..**

ఇరాన్ దాడిపై ఆగ్రహంతో ప్రతి దాడికి వెళ్తున్న ఇజ్రాయెల్‌ను తాను ఆపినట్టు ట్రంప్ చెప్పారు. 'ఆ బాంబులను వేయొద్దు. అదే కనుక చేస్తే కాల్పుల విరమణలో భారీ ఉల్లంఘనకు పాల్పడినట్టే. వెంటనే మీ పైలట్‌లను వెనక్కి పిలవండి' అని తాను ఆదేశించానన్నారు. యుద్ధం కొనసాగితే జరిగే తీవ్ర పరిణామాలు ఇరు దేశాలకు అర్థం కావడం లేదని అన్నారు. 'అన్ని విమానాలు ఇంటికి బయలుదేరి ఇరాన్‌కు స్నేహపూర్వ ప్లేన్ వేవ్ చేస్తాయి. ఎవరూ గాయపడకూడదు. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉంది' అని ట్రూత్‌లో పేర్కొన్నారు. నిజానికి తాము ట్రంప్‌తో మాట్లాడిన తర్వాత ఇరాన్‌పై కఠినమైన దాడిని నిలిపివేశామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. ట్రంప్ సమన్వయంతో ఇరాన్‌తో ద్వైపాక్షిక కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ అంగీకరించిందని ఆయన వెల్లడించారు. ఇలా ఉండగా, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో ఖతార్ కీలక పాత్ర పోషించింది.

## 400 కిలోల యురేనియం అదృశ్యంపై ఆందోళన!

### దానితో 10 అణ్వస్త్రాలు తయారుచేయొచ్చు.. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడి

న్యూఢిల్లీ: ఇరాన్‌లోని మూడు అణు పరిశోధనా కేంద్రాలపై అమెరికాకు చెందిన ఆరు బంకర్ బస్టర్ బాంబులు దాడి చేసిన తర్వాత ఆచూకీ తెలియకుండా పోయిన 400 కిలోల యురేనియం నిల్వలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ యురేనియం నిల్వలతో 10 అణు బాంబులను తయారు చేయవచ్చని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఏబీసీ న్యూస్‌కు తెలిపారు. నూతన అణ్వస్త్ర ఒప్పందంపై అమెరికాతో చర్చలు పునరుద్ధరించే సందర్భం వచ్చినపుడు మాయమైన యురేనియం నిల్వలను బూచిగా చూపించి ఇరాన్ తన షరతులను ముందుకు తెచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం 60% శుద్ధి చేసిన ఈ నిల్వలను దాదాపు 90% శుద్ధి చేసిన తర్వాత అణ్వస్త్రాలకు ఉపయోగించవచ్చు. అమెరికా బాంబులు వేయడానికి ముందే యురేనియం నిల్వలతోపాటు కొన్ని పరికరాలను వేరే రహస్య ప్రదేశానికి తరలించి ఉంటుందని ఇజ్రాయెలీ అధికారులు తెలిపారు. ఇరాన్‌లోని ఫోర్డో, నటాంజ్, ఇస్ఫాహన్ అణు పరిశోధనా కేంద్రాలపై అమెరికా బంకర్ బస్టర్ బాంబులతో దాడి చేసింది. ఈ దాడి జరగడానికి ముందు తీసిన ఉపగ్రహ చిత్రాలలో భూగర్భ ఫోర్డో అణు కేంద్రం వెలుపల వరుసగా నిలిపి ఉన్న 16 ట్రక్కులు కనిపించాయి. బాంబు దాడి తర్వాత తీసిన ఉపగ్రహ చిత్రాలలో మూడు అణు కేంద్రాల వెలుపల విధ్వంసం జరిగినట్లు కనిపిస్తుండగా ట్రక్కులు మాత్రం మాయమయ్యాయి. అయితే ఈ ట్రక్కులలో వేటిని తరలించారు, ఎక్కడకు తరలించారు స్పష్టం కానప్పటికీ ఇస్ఫాహన్ సమీపంలో ఉన్న మరో భూగర్భ స్థావరానికి యురేనియం నిల్వలను తరలించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

## బీ2 బాంబర్‌ను సృష్టించి.. చైనాకు రహస్యాలు చేరవేసి

### అమెరికాలో భారత్ ఇంజినీర్‌కు 32 ఏండ్ల శిక్ష



న్యూఢిల్లీ: ఇరాన్ అణు కేంద్రాలపై అగ్రరాజ్యం అమెరికా బీ-2 స్పిరిట్ బాంబర్లను ఉపయోగించిన విషయం తెలిసిందే. కీలక యుద్ధాల సమయంలో అమెరికా రంగంలోకి దించే ఈ యుద్ధ విమానం రూపకల్పనలో భారత్ మూలాలున్న ఒక ఇంజినీర్ కృషి కూడా ఉంది. అయితే ఈ ప్రాజెక్టు కీలక సమాచారాన్ని చైనాకు అందించారన్న ఆరోపణలపై ఆయనకు అమెరికాలో 32 ఏండ్ల శిక్ష పడింది. 1944లో ముంబైలో జన్మించిన నోషిర్ షెరియార్జీ గోవాడియా 1960లో అమెరికా వలస వెళ్లారు. అక్కడ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 1969లో అమెరికా పౌరసత్వం పొందారు. తర్వాత నార్తాప్ గ్రూమన్ కార్పొరేషన్‌లో డిజైన్ ఇంజినీర్‌గా చేరారు. రెండు దశాబ్దాల పాటు పని చేసి బీ2 బాంబర్‌కు తుది రూపు తీసుకొచ్చారు. ఇందులో ఇన్‌ఫ్రారెడ్, విజువల్ సిగ్నేచర్, రాడార్ తరంగాలను గ్రహించే వ్యవస్థల రూపకల్పనలో ఆయన ప్రముఖంగా వ్యవహరించారు. వీటితో పాటు విమాన ప్రొపెల్షన్ ప్రాజెక్టుల్లోనూ పనిచేశారు. తర్వాత అనారోగ్యంతో ఉద్యోగాన్ని వీడి సొంతంగా కన్సల్టెన్సీని ప్రారంభించారు. 1997లో ఆయన సెక్యూరిటీ క్లియరెన్స్‌ను అధికారులు రద్దు చేశారు. 2003-05 కాలంలో ఆయన చైనా అధికారులతో రహస్యంగా మంతనాలు సాగించినట్టు ఆరోపణలు వచ్చాయి. ఒక బాంబర్ అభివృద్ధి ప్రాజెక్టులో రూ.91 లక్షలు తీసుకున్న ఆయన చైనాకు సహకరించినట్టు ఎఫ్‌బీఐ గుర్తించింది. 2005లో అతడిని అరెస్ట్ చేశారు. న్యాయస్థానం 32 ఏండ్ల జైలు శిక్ష విధించింది.

## నోబెల్‌కు ట్రంప్ పేరు నామినేట్

**ప్రతిపాదించిన కాంగ్రెస్ సభ్యుడు**

వాషింగ్టన్, జూన్ 24: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడంలో మధ్యవర్తిత్వం వహించినందుకుగాను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి అమెరికా కాంగ్రెస్ సభ్యుడు ఎర్ల్ లెరాయ్ బడ్డీ కార్టర్ నామినేట్ చేశారు. ట్రంప్ యంత్రాంగం రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత ఈ నామినేషన్ దాఖలైంది. కాల్పుల విరమణ ఒప్పందం ఒక దౌత్యపరమైన పురోగతిగా కార్టర్ పేర్కొన్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య చర్చలను సులభతరం చేయడంతో, రెండు దేశాలను ఒక తాటిపైకి తీసుకువచ్చి పరస్పర ఆమోదయోగ్యమైన ఒప్పందాన్ని సాధించి రెండు వారాలుగా నెలకొన్న తీవ్ర సంక్షోభానికి తెరదించడంలో ట్రంప్ కీలకపాత్ర పోషించారని ఆయన ప్రశంసించారు.

## ఢిల్లీకి చేరిన మరో 17 మంది తెలంగాణ వాసులు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఇరాన్-ఇజ్రాయెల్‌లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత నేపథ్యంలో మరో 17 మంది తెలంగాణ వాసులు ఆ రెండు దేశాల నుంచి మంగళవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఈ మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ నుంచి ఐదుగురు, జోర్డాన్ నుంచి ఒకరు, ఇజ్రాయెల్ నుంచి 11 మంది భారత్‌కు చేరుకున్న వారిలో ఉన్నారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం స్వదేశానికి చేరిన తెలంగాణ వాసుల సంఖ్య 23కు చేరింది. వీరంతా హైదరాబాద్ రావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## విమాన ప్రమాద మృతుల సంఖ్య 275

**మృతుల్లో 124 మంది మహిళలు.. 16 మంది చిన్నారులు: గుజరాత్**

న్యూఢిల్లీ, జూన్ 24: జూన్ 12నాటి అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనలో మొత్తం 275 మంది ప్రాణాలు కోల్పోయారని గుజరాత్ ఆరోగ్య శాఖ మంగళవారం ప్రకటించింది. మొత్తం మృతుల్లో విమాన ప్రయాణికులు 241 మందికాగా, మరో 34 మంది ఘటనాస్థలానికి చెందిన ఇతరులుగా పేర్కొన్నది. ప్రమాద ఘటన తర్వాత మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన వెలువడటం ఇదే మొదటిసారి. మృతదేహాలన్నీ స్వాధీనం చేసుకున్నామని, ఇందులో 260 మృతదేహాల్ని డీఎన్ఏ పరీక్షల ద్వారా, ఆరు మృతదేహాలల్ని ముఖ గుర్తింపు ద్వారా గుర్తించినట్టు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

## అరిగిన టైర్లు.. చెరిగిన రన్‌వే మార్కింగ్స్!

- విమానయాన వ్యవస్థలో లోపాలెన్నో
- తనిఖీల్లో గుర్తించిన డీజీసీఏ అధికారులు

న్యూఢిల్లీ: విమాన నిర్వహణకు సంబంధించి ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా విమానాశ్రయాల్లో బుధవారం చేపట్టిన తనిఖీల్లో భద్రతా లోపాలు, ఉల్లంఘనలు గుర్తించామని డీజీసీఏ తాజాగా వెల్లడించింది. వీటిపై ఢిల్లీ, ముంబై విమానాశ్రయ నిర్వాహకులకు డీజీసీఏ ఏడు రోజుల సమయమిచ్చింది. ఓ ఎయిర్‌పోర్టులో అరిగిపోయిన టైర్ల కారణంగా ఓ దేశీయ విమానం నిలిచిపోయినట్టు డీజీసీఏ తెలిపింది. మరో విమానాశ్రయంలో రన్‌వే సెంటర్ లైన్ మార్కింగ్ చెరిగిపోయినట్టు వెల్లడించింది.

## బ్లాక్‌బాక్స్ దర్యాప్తు భారత్‌లోనే!

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో అత్యంత కీలకమైన బ్లాక్‌బాక్స్ దర్యాప్తు భారత్‌లోనే చేపడుతున్నామని పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ అంశంపై మీడియాలో వస్తున్న పలు వార్తా కథనాల్ని తోసిపుచ్చుతూ, భారత్‌లోని 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' మాత్రమే దర్యాప్తు చేస్తున్నదని ఆయన చెప్పారు. విమాన ప్రమాదం తర్వాత జరిగిన అగ్నిప్రమాదంలో బ్లాక్ బాక్స్ రికార్డర్లు దెబ్బతినటంతో అందులోని డాటా విశ్లేషణ కోసం.. దానిని అమెరికాకు పంపాలని కేంద్రం భావిస్తున్నట్టు మీడియాలో కథనాలు వచ్చాయి.

# ఆపరేషన్ నార్నియా

## నిద్రలో ఉండగానే 10 మంది ఇరాన్ సైంటిస్టులు హతం!



ఆపరేషన్ నార్నియాలో మృతి చెందిన ఓ సైంటిస్ట్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఇరానియన్లు

టెహ్రాన్, జూన్ 24: ఇజ్రాయెల్ బలగాలు (ఐడీఎఫ్) ఆపరేషన్ నార్నియాతో.. ఇరాన్ అణు కార్యక్రమంపై ఊహించని విధంగా దెబ్బకొట్టాయి. రాత్రిపూట తమ ఇంటిలో నిద్రిస్తున్న 10 మంది ఇరాన్ సైంటిస్టులను.. ఐడీఎఫ్ హతమార్చినట్టు 'చానల్ 12' వార్తా కథనం పేర్కొన్నది. ఇరాన్ అణు కార్యక్రమం నిలిచిపోవాలంటే, అందులో కీలకంగా ఉన్న సైంటిస్టుల్ని మట్టుబెట్టేందుకు ఇజ్రాయెల్ సిద్ధమైంది. ఇందుకోసం ఐడీఎఫ్ ప్రత్యేక సైనిక ఆపరేషన్ 'నార్నియా'ను చేపట్టింది. అణ్వస్త్రాల తయారీలో అపార అనుభవం, ఇరాన్ అణు కార్యక్రమంలో కీలకంగా ఉన్న సైంటిస్టుల జాబితా సిద్ధం చేసుకొని..నిఘా వర్గాల కచ్చితమైన సమాచారంతో లక్ష్యాలను ఐడీఎఫ్ పూర్తిచేసింది. బయటి ప్రపంచానికి తెలియని ఓ ప్రత్యేక ఆయుధాన్ని ఈ ఆపరేషన్ నార్నియాలో ఇజ్రాయెల్ వాడినట్టు తెలిసింది.

**ఎవరా సైంటిస్టులు?**

ఫెరియెదౌన్ అబ్బాసీ (అణు ఇంజనీరింగ్), మహమ్మద్ మాహ్దీ టెహ్రాంచీ (ఫిజిక్స్) అక్బర్ మటాలి జాదే (కెమికల్ ఇంజనీర్), సయీద్ బెరాజీ (మెటీరియల్స్ ఇంజనీర్), ఆమీర్ హస్సన్ ఫాకాహీ (ఫిజిక్స్), అల్ హమీద్ మినుషార్ (రియాక్టర్ ఫిజిక్స్), మాన్సోర్ అస్గరీ (ఫిజిక్స్), రెజా డవలపార్కీ దర్యానీ (అణు ఇంజనీర్), అలీ బాఖియా కాథెహెర్మి (మెకానికల్).. వీళ్లంతా ఆపరేషన్ నార్నియాకు బలయ్యారని చానల్-9, చానల్-12 వార్తా కథనాలు తెలిపాయి.

## నేడు రోదసిలోకి శుభాన్షు శుక్లా

న్యూఢిల్లీ, జూన్ 24: పలుమార్లు వాయిదా తర్వాత భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా రోదసి యాత్ర ఎట్టకేలకు ఖరారైంది. ఆయనతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపుతున్న 'యాక్సియం-4' మిషన్‌ను బుధవారం చేపడుతున్నట్టు నాసా తాజాగా వెల్లడించింది. ఇందుకు సంబంధించి స్పేస్ ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్‌ను ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించబోతున్నారు. 'బుధవారం (భారత్‌లో రాత్రి 12.01 గంటలకు) మిషన్‌ను చేపట్టేందుకు సమాయత్తమవుతున్నారు. భారత కాలమానం ప్రకారం గురువారం ఉదయం 7 గంటలకు డాకింగ్ ప్రక్రియ ఉంటుంది. ఈ మిషన్‌కు పెగ్గీ విట్సన్ కమాండర్‌గా, శుక్లా మిషన్ పైలట్‌గా వ్యవహరిస్తున్నారు. హంగేరీకి చెందిన టిబోర్ కపు, పోలండ్‌కు చెందిన స్లావోజ్ ఉనాన్సిక్-విస్నివిస్కలు మిషన్ స్పెషలిస్టులుగా ఉన్నారు.మే 29న చేపట్టాల్సిన ఈ మిషన్ ఆరుసార్లు వాయిదా పడింది.

## గుండు కొట్టించి.. గడ్డి తినిపించి!

- బీజేపీ పాలిత ఒడిశాలో దళితులపై అమానుషం
- పశువులు స్మగ్లింగ్ చేస్తున్నారనే ఆరోపణలతో దారుణం



డబుల్ ట్రబుల్ ఇంజిన్

బెర్హంపూర్: పశువులను అక్రమంగా తరలిస్తున్నారన్న అనుమానంతో ఇద్దరు దళితులపై దాడిచేసి, గుండుకొట్టి, మోకాళ్లపై నడిపించి బలవంతంగా గడ్డి తినిపించడమే కాకుండా వారితో మురికి నీరు తాగించారు. బీజేపీ పాలిత ఒడిశాలోని గంజాం జిల్లాలో ఆదివారం జరిగిందీ అమానుష ఘటన. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాకెక్కి వైరల్ కావడంతో రాజకీయంగానూ ఈ ఘటన తీవ్ర దుమారం రేపింది. సింగిపూర్‌కు చెందిన బాధితులు బాబులా నాయక్ (54), బాలు నాయక్ (42) కలిసి రెండు ఆవులు, ఒక దూడను ఆటోలో హరిఔర్ నుంచి తమ గ్రామమైన జహదకు తీసుకెళ్తున్నారు. తమను తాము గోరక్షకులుగా చెప్పుకొంటున్న కొందరు వ్యక్తులు ఖరిగుమ్మ వద్ద వారిని అడ్డుకున్నారు. గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపిస్తూ రూ. 30 వేలు డిమాండ్ చేశారు. అందుకు వారు నిరాకరించడంతో ఈ అమానుష చర్యకు పాల్పడ్డారు. తొలుత వారిని సమీపంలో సెలూన్‌కు తీసుకెళ్లి గుండు కొట్టించారు. అనంతరం కిలోమీటరు దూరం వరకు మోకాళ్లపై నడిపించారు. అక్కడ గడ్డి తినిపించి, మురికి నీళ్లు తాగించినట్టు పోలీసులు తెలిపారు. వారి బారి నుంచి ఎలాగోలా తప్పించుకున్న బాధితులు ధారకోటే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాబులా నాయక్ కుమార్తె వివాహం సందర్భంగా సంప్రదాయబద్ధంగా బహుమతి ఇచ్చేందుకే గోవులను కొనుగోలు చేసినట్టు బాధితులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్ట్ చేశారు.

## ఆటో సెటిల్‌మెంట్ లిమిట్ 5 లక్షలకు పెంపు

### ఈపీఎఫ్‌వో ఖాతాదారులకు శుభవార్త



*న్యూఢిల్లీ, జూన్ 24: ఈపీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త. ఇక నుంచి వారి ఆటో సెటిల్‌మెంట్ పరిమితి గణనీయంగా పెరగనుంది. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) తన క్లెయిమ్‌ల ఆటో సెటిల్‌మెంట్ పరిమితిని ప్రస్తుతమున్న రూ.లక్ష నుంచి 5 లక్షలకు పెంచింది. అత్యవసరంగా డబ్బు కావాల్సిన వారికి ఇది ఎంతో ప్రయోజనకారిగా ఉంటుంది. ప్రస్తుత ఆటో క్లెయిమ్‌ల ప్రక్రియ మాదిరిగానే ఈ క్లెయిమ్‌లు కూడా మూడు రోజుల్లో పరిష్కారం అవుతాయని కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ మంగళవారం తెలిపారు. దీంతో మాన్యువల్ వెరిఫికేషన్ అవసరం లేకుండానే పెద్ద మొత్తంలో నగదును విత్‌డ్రా చేసుకోవచ్చు. కాగా, కొవిడ్ సమయంలో నగదు అత్యవసరమైన ఖాతాదారుల సౌకర్యార్థం ఆటో సెటిల్‌మెంట్ సౌకర్యాన్ని ఈపీఎఫ్ఓ ప్రవేశపెట్టింది. అడ్వాన్స్‌డ్ విత్‌డ్రా కింద ఇప్పటివరకు లక్షకు మించి నగదు ఉపసంహరించాలనుకునే సభ్యులు మాన్యువల్ వెరిఫికేషన్ కోసం వేచి చూడాల్సి వచ్చేది. నాన్ ఆటో సెటిల్‌మెంట్ విధానంలో చందాదారులు ఈపీఎఫ్‌వో కార్యాలయానికి మాన్యువల్‌గా వెళ్లి, అనుమతి కోసం వేచి చూడాల్సి వచ్చేది. దీనికి చాలా సమయం పట్టేది. కాగా ఆటో సెటిల్‌మెంట్ పెంపు ప్రతిపాదనను ఈ ఏడాది మార్చిలో ట్రస్టీల సెంట్రల్ బోర్డు కార్యనిర్వాహక కమిటీ ఆమోదించినట్టు అధికారులు తెలిపారు.*

## గాజాలో 56 వేలు దాటిన మృతుల సంఖ్య

డేర్ అల్ బలాహ్ : హమాస్ అంతమే లక్ష్యంగా దాడులు ప్రారంభించిన సుమారు రెండేండ్ల కాలంలో ఇజ్రాయెల్ మిలిటరీ చేతిలో గాజాలో 56 వేల మందికి పైగా మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వెల్లడించింది. 2023, అక్టోబర్ 7 నుంచి జరుగుతున్న దాడుల్లో 56,077 మంది మరణించారని, 1,31,848 మంది గాయపడ్డారని తెలిపింది. రెండింటి మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన మార్చి 18 తర్వాత జరిగిన దాడుల్లో 5,759 మంది మరణించారని పేర్కొన్నది.

## రాజస్థాన్‌లో ఫ్రెంచ్ పర్యాటకురాలిపై రేప్

*ఉదయ్‌పూర్: బీజేపీ పాలిత రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఫ్రెంచ్ పర్యాటకురాలిపై లైంగికదాడి జరిగింది. ఓ పార్టీలో కలిసిన వ్యక్తి ఆమెను తన అపార్ట్‌మెంట్‌కు తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడని పోలీసులు సోమవారం వెల్లడించారు. ఎఫ్ఐఆర్ ప్రకారం.. ఈ నెల 23న బాధితురాలు టైగర్ హిల్ సమీపంలోని ఓ కెఫెలో జరిగిన పార్టీకి హాజరైంది. అక్కడ ఆమె నిందితుడిని కలిశారు. 'బయటికెళ్లి పొగ తాగుదాం. చుట్టుపక్కల ఉన్న అందమైన ప్రదేశాలు నీకు చూపిస్తా' అని నిందితుడు ఆ పార్టీ నుంచి ఆమెను బయటకు తీసుకెళ్లాడు. తాను బస చేసిన హోటల్‌కు తిరిగి వెళతానని ఆమె అభ్యర్థించినప్పటికీ అతడు ఆమెను తన అద్దె ఫ్లాట్‌కు తీసుకెళ్లాడు. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయి ఉండటంతో ఆమె సాయం కోసం ఎవరినీ పిలవలేకపోయింది. అక్కడ అతడు ఆమెను ఓ కౌగిలింత ఇవ్వమని అడిగాడు. దానికి ఆమె నిరాకరించడంతో ఆమెపై లైంగిక దాడి చేశాడు.*

# పెరగనున్న రైలు టికెట్ చార్జీలు!

- *నాన్ ఏసీకి కి.మీ.కు పైసా.. ఏసీ తరగతికి 2 పైసలు పెంపు*
- *జూలై 1 నుంచి అమలులోకి?*



*న్యూఢిల్లీ, జూన్ 24: రైల్వే టికెట్ ధరలు పెరగనున్నాయి. ప్రభుత్వం దీనిని అధికారికంగా ప్రకటించక పోయినా రైల్వే ఉన్నతాధికారి ఒకరు దీనిని వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రయాణికులపై పెరిగిన చార్జీల భారం జూలై 1 నుంచి అమలులోకి వస్తుంది. నాన్ ఏసీ మెయిల్, ఎక్స్‌ప్రెస్ చార్జీలు కిలోమీటర్‌కు ఒక పైసా, ఏసీ తరగతి ప్రయాణికులకు 2 పైసలు చొప్పున పెరుగుతాయి. సబర్బన్ రైళ్ల టికెట్ చార్జీలు, నెలవారీ సీజన్ టికెట్ ధరల్లో మార్పు ఉండదు. దీని కారణంగా రోజువారీ రైలు ప్రయాణం చేసే వారిపై భారం పడదు. 500 కి.మీ దూరం వరకు సెకండ్ క్లాస్ సాధారణ తరగతిలో ప్రయాణించే వారికి ఎలాంటి చార్జీల పెంపు ఉండదు. అయితే వీరే 500 కి.మీ దాటి ప్రయాణిస్తే అదనపు కిలోమీటర్‌కు అర పైసా చొప్పున పెరుగుతుంది. అంటే ఉదాహరణకు ఈ తరగతిలో ఎవరైనా 600 కి.మీ దూరం ప్రయాణిస్తే వారిపై అదనంగా 50 పైసలు (100 కి.మీ x 0.005 పైసలు) పెరుగుతుంది. దేశవ్యాప్తంగా ప్రతిరోజూ నడిచే 13 వేల రోజువారీ నాన్ ఏసీ-మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఈ పెరిగిన చార్జీలు వర్తిస్తాయని, చాలా ఏండ్ల తర్వాత ప్రభుత్వం రైలు చార్జీలు పెంచనుందని, కొత్త చార్జీలు ప్రయాణికుల బడ్జెట్‌పై గణనీయమైన ప్రభావం చూపదని ఆ సీనియర్ రైల్వే అధికారి తెలిపారు. కాగా, రైలు టికెట్ల రిజర్వేషన్‌లో అక్రమాలు చోటు చేసుకోకుండా జూలై 1 నుంచి టికెట్లు బుక్ చేసే ప్రతి ప్రయాణికుడు తప్పక ఆధార్ నమోదు చేసుకోవాలి. అలాగే జూలై 15 నుంచి ప్రయాణికుడి ఆధార్ ఆథంటికేషన్‌ను కేంద్రం తప్పనిసరి చేసింది.*

***అన్ని బెర్తుల్లో 25% సీట్లు వెయిటింగ్ లిస్ట్‌కు***

*న్యూఢిల్లీ: స్టేషన్లు, ప్లాట్‌ఫామ్‌లలో రద్దీని తగ్గించడానికి, ప్రయాణికుల్లో టికెట్ల స్థితిపై తికమకను నివారించడానికి వెయిటింగ్ లిస్ట్ టికెట్లను నియంత్రిస్తూ టికెటింగ్ వ్యవస్థలో రైల్వే శాఖ సంస్కరణలు చేపట్టింది. కొత్త విధానం ప్రకారం అన్ని రైళ్లలో వాటి మొత్తం సీట్ల సామర్థ్యంలో 25 శాతం టికెట్లను వెయిటింగ్ లిస్ట్‌కు పరిమితం చేస్తారు. ఇది అన్ని రకాల కోచ్‌లకు, బెర్తులకు వర్తిస్తుంది. ఈ విధానాన్ని ఈ వారం నుంచే చాలా రైల్వే జోన్లలో అమలవుతున్నది. ఈ విధానంలో వివిధ కోటాల్లో టికెట్లను కేటాయించాక, ప్రతి క్యాటగిరీలో మొత్తం సీట్లలో 25 శాతాన్ని వెయిటింగ్ లిస్ట్ టికెట్లకు కేటాయిస్తారు. ప్రతి క్యాటగిరీలో ఇప్పటివరకు సుమారుగా 20-25 శాతం వెయింటింగ్ లిస్ట్ టికెట్లు మాత్రమే కన్ఫర్మ్ అవుతుండటంతో కొత్త విధానంలో 25 శాతం సీట్లను వెయిటింగ్ లిస్ట్ కోసం కేటాయించాలని నిర్ణయించారు. ఆ పరిమితి తర్వాత కూడా ఎవరైనా టికెట్ బుక్ చేయడానికి ప్రయత్నిస్తే వారికి 'రిగ్రెట్(విచారం)' అని స్పందన కనిపిస్తుంది. దీని వల్ల ఇకపై ప్రయాణికులు తదుపరి అందుబాటులో ఉండే రిజర్వేషన్ అవకాశాన్ని ఉపయోగించుకోవడం లేదా సాధారణ కోచ్‌లో ప్రయాణించడంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.*